క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



ఆలయ అధికారులకు బంగారం సమర్పిస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి యర్నగూడెంనకు చెందిన కోలా సూర్యనారాయణ కుటుంబ సభ్యులు రూ.70 వేలు నగదు, 8 గ్రాముల బంగారం సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు.

ఐఏఎల్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

సాక్షి, భీమవరం: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా 5వ మహాసభలు భీమవరంలోని డీఎన్నార్ లా కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్‌ను రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలు చేయాలన్నారు. అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. న్యాయవాదులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కరోనాలో మరణించిన న్యాయవాదులకు వైల్ఫేర్ ఫండ్‌ను రిలీజ్ చేయాలని, న్యాయవాదులకు భద్రతా చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా చల్లా దాననాయుడు, అధ్యక్ష కార్యదర్శులుగా చెల్లబోయిన రంగారావు, నెక్కంటి క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడిగా మల్లుల శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏలేటి న్యూటన్‌తో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

ముగిసిన అలుగులమ్మ జాతర

ఉండి: చెరుకువాడ గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అలుగులమ్మ అమ్మవారి 104వ వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు(శివయ్య) ఆధ్వర్యంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు(హరిబాబు), జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ, రణస్తుల మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా జాతర ఉత్సవాలు చాలా ఘనంగా జరిగాయన్నారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, మొక్కులు చెల్లింపులు, తీర్థప్రసాదాల పంపిణీ తదితర కార్యక్రమాలన్నీ భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంతో పాటుగా ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ (సత్తిబాబు) పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివృద్ధి

తాడేపల్లిగూడెం రూరల్: సమాజ ఆరోగ్యంతోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హర్ష అన్నారు. ఆదివారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కేన్సర్‌పై సైకిల్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్ష మాట్లాడుతూ కేన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోందని, మనం తినే ఆహార పదార్థాల్లో కేన్సర్ కారకాలు ఉంటున్నాయన్నారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వినియోగించడం, ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ పాత్రలలో నిల్వ ఉంచడం వల్ల కేన్సర్ వ్యాప్తి చెందుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆహారాన్ని మాత్రమే తినాలని, అత్యవసరమైతే తప్ప బయట ఆహారాన్ని తినరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ విరోనిక, ఫార్మాసిస్ట్ రామారావు, హెచ్‌వీ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణంలోని తాలూకా రైల్వే గూడ్స్ షెడ్డు కార్యాలయంలో వర్కర్స్ యూనియన్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసనకు యూనియన్ అధ్యక్షుడు సత్తి కోదండ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, నాయకులు తేతలి నాగిరెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని అన్నారు. ధరల పెరుగుదలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్‌వీఎస్ రెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, అడపా ఆంజనేయులు, ఆకుల నారాయణ పాల్గొన్నారు.

సీఎంకు ఆత్మీయ స్వాగతం



ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఆదివారం నరసాపురం చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు గోకరాజు రంగరాజు, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పూర్వ అధ్యక్షులు గోకరాజు కనక రంగరాజు (పెద బుజ్జి), పార్టీ సీనియర్ నాయకులు గాదిరాజు సుబ్బరాజు

సర్రాజు కుటుంబ సభ్యులకు ధర్మాన పరామర్శ



సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ధర్మాన

కాళ్ల: క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు మృతి పట్ల మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాసు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భీమవరంలోని సర్రాజు నివాసంలో కుమారులు వాసు, వర్మలను ఆదివారం కలిసి పరామర్శించారు. మహానేత వైఎస్సార్ హయాంలో దివంగత రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు, తాను ఎమ్మెల్యేలుగా పనిచేశామని, కుటుంబ సభ్యులుగా ఉన్నామని నరసన్నపేట ఎమ్మెల్యే, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. భీమవరం ఆదర్శనగర్‌లో సర్రాజు నివాసంలో సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మాన కృష్ణ చైతన్య, పాతపాటి వెంకట శ్రీనివాసరాజు, యుగంధర్ నాగ వర్మ, చేకూరి చంటిరాజు, గొట్టుముక్కల కల్యాణ వర్మ, వేగేశ్న సూర్యనారాయణ రాజు, పాటూరి దొరబాబు, రాయి సతీష్, నిమ్మల కేశవ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



కలిదిండి సత్యనారాయణరాజు దంపతులను సత్కరిస్తున్న ఆర్వీ ఆర్వీ సూర్యనారాయణరాజు, లయన్స్

ఆకివీడు: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కలిదిండి సత్యనారాయణరాజు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన లయన్స్ రీజియన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేవలం డబ్బుతోనే ముడిపడి ఉన్న సేవలే కాక మాట, భౌతికంగా కూడా సేవలందించవచ్చన్నారు. ప్రతి వ్యక్తి తనను తాను నమ్ముకుని, కార్యదక్షతను నమ్ముకోవాలన్నారు. సంపాదనలో ఎంతో కొంత, తాహతుకు మించకుండా సేవలందించాలన్నారు. మనిషి చేయలేనిది ఏదీ లేదని, చేయలేననుకోవడమే దౌర్భాగ్యమన్నారు. సేవాతత్పరత లయన్స్ సభ్యుల ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. కెనరా బ్యాంక్ ద్వారా ఏటా దేశంలో రూ.100 కోట్ల మేర సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నామని, 75 వేల మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజియన్ చైర్మన్ ఆర్వీ.సూర్యనారాయణరాజు, వీకే పంకజాక్షం, డాక్టర్ ఎమ్వీ సూర్యనారాయణరాజు, సీహెచ్ కృష్ణంరాజు, మురళీరాజు, వివిధ ప్రాంతాల నుంచి లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం సైకిళ్లు, గ్రైండర్లు, కుట్టుమెషీన్లను సత్యనారాయణరాజు పంపిణీ చేశారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం



విస్సాకోడేరులో సైకిల్ తొక్కుతున్న చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకోడేరు: ప్రతిరోజూ సైక్లింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు అన్నారు. ఆదివారం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సైక్లింగ్‌పై వ్యాయామం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ రంగం నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ బిజీ బిజీ లైఫ్ గడపడంతో ఆరోగ్యాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయన్నారు. ఆరోగ్యాన్ని అదుపులో ఉంచుకోవాలంటే ప్రతిరోజు సైకిల్ తొక్కాలని సూచించారు. ఈ సందర్భంగా పాలకోడేరు, విస్సాకోడేరు, గొరగనముడి, పెన్నాడ, మొగల్లు తదితర గ్రామాల్లో సైక్లింగ్ తో వ్యాయామం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సత్యనారాయణ, సూపర్వైజర్లు శంకర్, అయ్యప్ప శ్రీనివాస్, చండీరాణి, అమ్మాజీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చేబోలుకు ఘన నివాళులు



చేబోలుకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ప్రజా పోరాటాల్లో అలుపెరగని కృషి చేసిన ఉద్యమ నాయకుడు చేబోలు సత్యనారాయణ అని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే క్రాంతి బాబు అన్నారు. ఆదివారం చేబోలు మూడో వర్ధంతిని పాలకోడేరులో ప్రజా సంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు అశ్రియ్య అధ్యక్షతన నిర్వహించారు. తొలుత చేబోలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మాట్లాడుతూ చేబోలు సత్యనారాయణ తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారని కొనియాడారు. పాలకోడేరు, ఉండి మండలాల్లో ఎన్నో భూ పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. పేదల పక్షాన నిలిచి వారి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. వైఎస్ఎన్ మూర్తి, దున్న మరియమ్మ, దున్న శాలిని, సిహెచ్ లక్ష్మి, చేబోలు కనకదుర్గ, చంద్ర పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో లక్ష దీపాలంకరణ



శివలింగం ఆకారంలో దీపాలంకరణ



లక్ష దీపాలంకరణలో కనకదుర్గమ్మ ఆలయం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ఊంజల్ సేవ అనంతరం లక్ష దీపాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో బాగంగా ఉదయం అమ్మవారికి ఇరగవరం వేద పండితులచే లక్ష కుంకుమార్చన పూజ కార్యక్రమాలు చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న పరమేశ్వరుని విగ్రహం వద్ద శివలింగం ఆకారంలో దీపాలను అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు.

జీఐఎస్‌తో రాష్ట్రం వైపు.. ప్రపంచం చూపు



మేడిది జాన్సన్

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రపంచ మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా, రాష్ట్రం గురించి మాట్లాడుకునేలా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను విజయవంతం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్ అన్నారు. భీమవరంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ ప్రపంచం మొత్తం మాట్లాడుకునే స్థాయిలో జరగడం సంతోషకరమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకురావడం అనేది అతి గొప్ప విషయమన్నారు. ఇంత పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు రావడం గతంలో లేదన్నారు. సమ్మిట్‌లో దిగ్గజ పారిశ్రామికవేత్తలు, సీఎం వైఎస్ జగన్ ప్రసంగాలతో పారిశ్రామికవేత్తల్లో ఏపీలో పెట్టుబడులు పెట్టాలన్న నమ్మకం, భరోసా కలిగించాయన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలో అన్నింటా ముందంజలో ఉండేలా అభివృద్ధి చేయగలిగే సత్తా కేవలం సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే ఉందని, విశాఖలో జరిగిన గోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా స్పష్టం అయిందన్నారు. ఒక పక్క ప్రజలకు సంక్షేమం అందిస్తూ మరో పక్క పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతున్న ఈ ప్రభుత్వంలో భాగస్వామ్యం అవుతుండటం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నానని అన్నారు.

నేడు పాలకొల్లులో సీజ్ చేసిన వాహనాల వేలం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పోలీస్‌స్టేషన్లో ఎస్ఈబీ కేసుల్లో పట్టుబడిన ఐదు మోటర్ వాహనాలను వేలం పాట వేయనున్నట్లు పట్టణ సీఐ డి.రాంబాబు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఈ వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరిస్తామని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదివారం విలేకరులకు తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

రామన్నపాలెం కాలువ పూడికతీత పనులు



కాలువలో పూడిక తొలగిస్తున్న రైతులు

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారి పాలెం శివారు ప్రాంత భూములకు సాగునీరు అందక రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 150 ఎకరాల ఆయకట్టురైతులు ఆదివారం చేయి చేయి కలిపి శ్రమదానం చేసి రామన్నపాలెం మెయిన్ కెనాల్లో రామన్నపాలెం వద్ద కాలువలో పేరుకుపోయి ఉన్న మట్టి, తూడు తొలగించారు. ఫలితంగా రామన్నపాలెం ఛానల్ నుంచి సాగునీరు ఉధృతిగా శివారు ప్రాంతాల వరకూ ప్రవహించేందుకు అవకాశం ఏర్పడింది. ఈ తూడు, మట్టి తొలగింపు కార్యక్రమాన్ని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి బాబులు, కూనపరెడ్డి సూర్యనారాయణ, కట్టా వెంకటేశ్వర్లు, కూనపరెడ్డి శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.

రేపటి నుంచి జీవధ్వజ స్తంభ మహోత్సవాలు

పెనుగొండ: స్థానిక నగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో నూతన జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ వేడుకగా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ల మోహనరావు, ఈఓ జీఎస్ఎస్ శ్రీనివాస్‌లు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 7న జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠ సంకల్పం, విఘ్నేశ్వర పూజ, గోపూజ, వాస్తు హోమాలు, ప్రాయశ్చిత హోమాలు, శాంతి హోమాలు, 8న ప్రతిష్ఠ హోమాలు, వాస్తు హోమాలు, ప్రధాన హోమాలు, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, నీరాజన మంత్ర పుష్పాలు, 9న స్వస్తి వచనాలు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రసన్న, రత్నన్యాసం, మహిషాసురమర్ధనీ సమేత వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్ల జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, కల్యాణ మండప శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: ముత్యాలపల్లిలోఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులుతీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ పాలక వర్గ చైర్మన్ కొల్లాటి రామారావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామ దేవతలకు చలిమోరు సమర్పణ

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రులో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామ దేవతలకు భక్తులు చలిమోరు సమర్పించారు. గ్రామదేవతలైన శ్రీ వేగులమ్మ, శ్రీ ముత్యాలమ్మ, శ్రీ గోగులమ్మ అమ్మవార్లకు గ్రామ పెద్దలు అల్లు శ్రీనివాసరావు-ఉమాదేవి దంపతులతో చలివిడి, పానకం, వడపప్పు సమర్పించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం రాత్రి 8:29 నిమిషాలకు జరగనుంది. దీనిలో భాగంగానే గ్రామంలోని సుహాసినీ స్త్రీలు, యువజనులు అమ్మవార్లకు చలిమోరు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు ఎంఎస్ వాసు, రావాడ సతీష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యక్తికి గాయాలు

సాక్షి, భీమవరం: మోటార్‌సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం నుంచి నర్సయ్య అగ్రహారానికి మోటార్ సైకిల్‌పై వెళుతున్న పి.కృష్ణంరాజును పాలకొల్లు నుంచి భీమవరం వస్తున్న మరో మోటార్ సైకిల్ ఆదివారం ఢీకొంది. ఈ ఘటనలో కృష్ణంరాజుకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ బి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంచార వైద్య సేవ

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 20 మందికి ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యుడు బొండాడ వెంకటేశ్వర్లు తణుకు పాతూరు, తణుకు, హౌసింగ్ బోర్డు కాలనీ, టీచర్స్ కాలనీ, గ్రామంలో మంచానికే పరిమితమైన వారికి ఇంటివద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సంఘ సభ్యుడు అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో అందించిన మందులను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు.

ఆక్వా సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళతా



ఎంపీ మోపిదేవిని కలిసిన నేతలు

పాలకోడేరు: ఆక్వా సమస్యలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరిస్తానని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ హామీ ఇచ్చారు. ఆదివారం భీమవరం వచ్చిన ఆయనను విస్సాకోడేరు గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనువాసు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిన్నంరాజు పృధ్వీరాజు మర్యాదపూర్వకంగా కలిసి, ఆక్వా రంగంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ బిల్లులు, సబ్సిడీ తదితర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈ సమస్యలను ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకువెళ్లానని త్వరలోనే పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు.